
## క్లుప్తంగా

### నిత్యం రామాయణం పఠించాలి



నిజామాబాద్ రూరల్ : ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి రామనామ స్తోత్రం, హనుమాన్ చాలీసా దోహద పడుతుందని బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వట్టల్వార్ ప్రమోద్ అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ రామాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో నిత్యం రామాయణం పఠించాలని, రామనామ స్మరణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు రామనామ స్తోత్రాన్ని సామూహిక పారాయణం చేసి సీతారామ చంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ప్రమోద్ హర్గే, సకారాం రామనాథ్ వైగర్కర్, న్యాలం శ్రీనివాస్, చంద్రశేఖర శర్మ, దత్తు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

### సాహిత్య పురస్కారాలకు ఎంపికైన జిల్లా కవులు



వీపీ చందన్‌రావు



కాసర్ల నరేశ్

నిజామాబాద్ రూరల్: సాహితీ రంగంలో విశేష సేవలందిస్తున్న జిల్లాకు చెందిన ప్రముఖ కవులు వీపీ చందన్ రావు, డా.కాసర్ల నరేశ్ రావులు సాహిత్య పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందన్ రావును డా.సినారె జాతీయ సాహిత్య పురస్కారం, డా.కాసర్ల నరేశ్ రావును కాళోజీ జాతీయ సాహిత్య పురస్కారంతో సత్కరించనున్నారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

నిజామాబాద్ నాగారం: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇందల్వాయిలో మృతిచెందిన అనాథ వృద్ధుడి శవాన్ని పోస్టుమార్టం నుంచి తీసుకొని ఇందల్వాయి ఎస్సై ఆదేశాల మేరకు నాందేవ్‌వాడలోని శ్మశానవాటికలో స్వచ్ఛంద సేవా సభ్యులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కోశాధికారి జయదేవ్ వ్యాస్, నరేశ్ రెడ్డి, ఇందల్వాయి పోలీస్ సిబ్బంది ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మిలాద్ ఉన్ నబీ



నిజామాబాద్ రూరల్ : నగరంలో ఆదివారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖిల్లా రోడ్డు అహ్మద్ పూర కాలనీ బర్కత్ పుర, మాలపల్లి కంఠేశ్వర్ ఎల్లమ్మ గుట్ట వినాయక నగర్ తదితర ప్రాంతాల్లోని మసీద్‌ల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అంతకుముందు మాలపల్లి, ఆటోనగర్, అహ్మదీబజార్ తదితర ప్రాంతాల నుంచి ర్యాలీగా బయలుదేరి నెహ్రూ పార్క్ మసీద్‌కు చేరుకున్నారు. మత పెద్ద మహమ్మద్ ప్రవక్త గురించి శాంతి సందేశాన్ని ఇచ్చారు. షోహెబ్ రజ, కన్వీనర్ రషీద్ రజ్వీ, షాహైద్ రజ తదితరులు పాల్గొన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | |
|---|---|
| 24 క్యారెట్స్ 1,14,500 | వెండి(కిలో) 1,34,500 |
| 22 క్యారెట్స్ 1,05,727 | – నిజామాబాద్ బిజినెస్ |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 180 |
| | (కిలోకు) | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 200 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 12 | 24 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 20 | 40 | పచ్చిమిర్చి | 40 | 80 |
| బీరకాయ | 40 | 80 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 40 | 80 | ఆలుగడ్డ | 20 | 40 |
| బిర్నిసుకాయ | 70 | 140 | గోబిగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 30 | 60 | గోబిపువ్వు | 30 | 60 |
| వంకాయ | 30 | 60 | బీట్‌రూట్ | 30 | 60 |
| పాలకూర | 50 | 100 | కరివేపాకు | 40 | 80 |
| మెంతికూర | 60 | 110 | చామగడ్డ | 30 | 60 |
| కొత్తిమీర | 40 | 80 | చిక్కుడుకాయ | 50 | 90 |
| పుదీనా | 40 | 80 | గోరుచిక్కుడు | 50 | 90 |
| క్యాప్సికం | 40 | 80 | | | |

–సుభాష్‌నగర్

# దుబ్బలో అధ్వానంగా పారిశుధ్యం

- ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు
- శుభ్రం చేయని పారిశుధ్య కార్మికులు
- దుర్గంధంతోనే ప్రజల సావాసం
- ఫిర్యాదుచేసినా పట్టించుకోని శానిటరీ అధికారులు



ముస్లిం బస్తీలో రోడ్లమీదనే కుప్పలుగా పేరుకుపోయిన చెత్త



పవన్‌నగర్‌లో ఇంటిముందే డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరు

### తాగునీరులో మురుగు

నిజామాబాద్ సిటీ : నగరంలోని దుబ్బవాసులు అపరిశుభ్ర వాతావరణంలో జీవిస్తున్నారు. దుబ్బ డివిజన్‌లోని పవన్‌నగర్, ముస్లింబస్తీ, అరుంధతీనగర్, ఆదర్శనగర్, శాస్త్రినగర్ వంటి పలు కాలనీల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. మాజీ కార్పొరేటర్, సీనియర్‌నాయకుడు దారం సాయిలు ఇంటికి వెళ్లే దారిలోనే నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ రోడ్డు మీద చెత్తకుప్పలు పెరిగిపోయి అటుగా వెళ్తున్న వారు ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. క్రమం తప్పకుండా చెత్త తొలగింపు, డ్రెయినేజీలు తీయడం వంటి పనులు సాఫీగా చేయడం లేదనే విమర్శలున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా ఖాతరుచేయడంలేదు. డ్యూటీలు మాత్రం మొక్కుబడిగా చేస్తున్నారు.

పవన్‌నగర్ కాలనీలోని ప్రధాన రోడ్డుకు సమీపంలోని ఇంటిముందరే మురుగునీరు పారుతోంది. నెల రోజులుగా డ్రెయినేజీ శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. శానిటరీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇంటిముందరే డ్రెయినేజీలు నిండిపోయాయని, తాగేనీరు కూడా పక్కనే ఉండటంతో తాగునీటిలో మురుగు నీరు కలుస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదుచేసినా శానిటరీ సిబ్బంది పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. శాస్త్రినగర్, అరుంధతీనగర్, పవన్ నగర్‌లలో రోడ్లమీద ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పలతో దుర్గంధం వ్యాపించడంతోపాటు దోమలు వ్యాప్తిచెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



పవన్‌నగర్‌లో డ్రెయినేజీ పక్కన మొలిచిన పిచ్చి మొక్కలు



శాస్త్రి నగర్‌లో పేరుకుపోయిన చెత్తను తింటున్న పశువులు



ఆదర్శనగర్‌లో రోడ్లమీద పారుతున్న మురుగు

#### డ్రెయినేజీ శుభ్రం చేయడం లేదు



మేం పవన్‌నగర్‌లో నివసిస్తున్నాం. మా ఇంటిముందు డ్రెయినేజీ ఉంది. నెల రోజులుగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీటిలో డ్రెయినేజీ నిండిపోయింది. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి. – శోభ, పవన్‌నగర్

#### ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు



మా గల్లీల్లో చెత్తను తొలగించడం లేదు. ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. గతంలో కమిషనర్ సార్‌కు ఫొటోలు తీసి పెట్టాం. కార్మికులు సరిగా రావడం లేదు. జవాన్, ఎస్‌ఐకి ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా ఖాతరు చేస్తాలేరు. కమిషనర్ చర్యలు తీసుకోవాలి.

–గంగాధర్, పవన్‌నగర్

#### రోడ్ల మీద చెత్త తొలగిస్తలేరు



మాది ముస్లిం బస్తీ. మా కాలనీల్లో రోడ్లమీదనే చెత్త కుప్పలు నిండిపోయాయి. మున్సిపల్ సిబ్బంది రావడం లేదు. వచ్చినా సరిగా పనులు చేయరు. చెత్త తీయాలంటే రూ.70 ఇవ్వమని డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిస్తామన్నా చెత్త తొలగిస్తలేరు. – పద్మ, శాస్త్రినగర్

#### సమస్యలుంటే ఫిర్యాదులు చేయాలి



బల్దియా సిబ్బంది డ్యూటీలు ఖచ్చితంగా చేయాలి. మొక్కుబడిగా చేస్తే చర్యలు తప్పవు. నిర్దేశించిన మేర శుభ్రం చేయాలి. జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా పనులు పర్యవేక్షించాలి. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడం. కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా. పారిశుద్ధ్య సమస్యలుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి. –ఎం.ఎ.నజీర్, ఏఎంసీ (శానిటేషన్)

### బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్కార భారతి సభ్యులు

నిజామాబాద్ రూరల్ : నగరంలోని కిడ్స్ ఫ్యూచర్ పాఠశాలలో సంస్కార భారతి ఇందూరు మహానగర్ ఆధ్వర్యంలో బతుకమ్మ పోస్టర్‌ను తెలంగాణ ప్రాంత సహాయ కార్యదర్శి వేణుగోపాల్‌ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాన్ని పరిరక్షించే విధంగా మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 30వ తేదీ లోపు వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలను మాతృ శక్తి కన్వీనర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంత కార్యదర్శి గంటెల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, కోశాధికారి రాధాకృష్ణ, రమణచారి, కందకుర్తి ఆనంద్, అవన్ కుమార్, శివకుమార్, మధు చారి, మాతృశ్రీ కన్వీనర్ ఎస్ మాధురి, వరలక్ష్మి, శ్రీలత సంస్కార భారతి ఇందూరు కార్యకర్తలు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు పండ్ల పంపిణీ

నిజామాబాద్ నాగారం: నగరంలోని స్నేహ సొసైటీలో ఆదివారం సీనియర్ జర్నలిస్టు అంజాగౌడ్ 7వ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు మానసిక దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం, బిస్కెట్లు, సమోసాలు పంపిణీ చేశారు. అలాగే నగరంలోని బైపాస్ రోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య మాట్లాడుతూ అంజా గౌడ్ వర్ధంతి సందర్భంగా వికలాంగుల పిల్లలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. అంజాగౌడ్ కుటుంబసభ్యులు, కిషోర్ గౌడ్ , కిరణ్ గౌడ్, నరేంద్ర గౌడ్, బింగి శుభం, సిద్దు పవర్, రమేష్, సతీష్, లవన్ కుమార్, రాహుల్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో హోమియో వైద్యం



సదస్సులో పాల్గొన్న హోమియో వైద్యులు

నిజామాబాద్ నాగారం : హోమియో వైద్యం ప్రస్తుతకాలంలో అందరికి అందుబాటులో ఉంటుందని హోమియో వైద్యుల రాష్ట్రసంఘం అధ్యక్షుడు డా. చంద్ర శేఖర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం నిఖిల్ సాయి హోటల్‌లో జిల్లా స్థాయి హోమియో వైద్యుల సదస్సు జరిగింది. ఈసదస్సు ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ రావు హాజరై మాట్లాడారు. ఇతర వైద్య విధానాల కంటే హోమియో వైద్యం సులభతరమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా హోమియో వైద్య సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డా. కృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా అనంత్ కులకర్ణి ,కోశాధికారి గా మహేష్ కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన హోమియో వైద్యులు పాల్గొని పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డా. శివమూర్తి, డా.దీపక్ బాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీమా ఉద్యోగుల పోరాట ఫలితమే జీఎస్టీ రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

నిజామాబాద్ రూరల్ : బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేస్తు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (అఖిల భారత బీమా ఉద్యోగులు సంఘం) పోరాట ఫలితమే అని సంఘం సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్.రఘు అన్నారు.ఎఐఐఇఎ నిజామాబాద్,బోధన్, ఆర్మూర్ ఎల్ఐసీ శాఖల సాధారణ సర్వసభ్య సమావేశం నిజామాబాద్‌శాఖ కార్యాలయంలో ఆదివారం జరిగింది.ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజ్ఞప్తులు ఇవ్వడంతోపాటు ఎన్నో ఆందోళనలు చేశామన్నారు. ఎల్ఐసీలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో డివిజన్ అధ్యక్షులు గుణశేఖర్, కోశాధికారి జావీద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల సంయుక్త కార్యదర్శులు రాజేష్ శ్రావణ్,ఒగ్గు శివ, డివిజన్ నాయకులు నవీన్ దాస్, అనిల్, మూడు బ్రాంచీల అధ్యక్షులు పీఎస్.సామ్రట్, బి.మురళి, రాకేష్, కార్యదర్శులు డి.సురేష్, మారుతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా దుస్తుల వితరణ



దుస్తులను అందిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ : మండల కేంద్రంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను న్యావనంది గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఉమ్మాజీ నరేష్ వితరణ చేశారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి దుస్తులను విద్యార్థులకు ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి జిల్లాకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపి, పాఠశాల ప్రిన్సిపాల్ భోజరాం, పీడీ ప్రశాంత్, ఉపాధ్యాయులు సంజీవ్ ఫీల్డ్ అసిస్టెంట్ గణేశ్, రాజేశ్వర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఊర పండుగలో గ్రామదేవతలకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

# గ్రామాల్లో ఘనంగా ఊరపండుగ



కంజర్‌లో బోనాలతో ఊరేగింపు



బోర్గాం(పి)లో పోతరాజుల విన్యాసాలు

డిచ్‌పల్లి/మోపాల్ : డిచ్‌పల్లి, మోపాల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఊర పండుగను తో ఘనంగా జరుపుకున్నారు. మోపాల్ మండలం కంజర్, మంచిప్ప, తాడెం, చిన్నాపూర్‌తో పాటు నగర శివారులోని బోర్గాం (పి), ఖిల్లా డిచ్‌పల్లిల్లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోర్గాం(పి)లో గ్రామదేవతలను ప్రతిష్ఠించారు. పోతరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రతి ఏటా గ్రామదేవతలకు బోనాలతో నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి నాయకులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా హిందీ భాషా దినోత్సవం



కంజర్ గురుకులంలో ఉపకరణాలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మోపాల్ : మండలంలోని కంజర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో హిందీ భాషా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హిందీ భాషను సరళ పద్ధతిలో నేర్చుకునే విధంగా మంచి టీచింగ్ ఉపకరణాలు తయారు చేశారు. ప్రిన్సిపాల్ విజయ లలిత, హిందీ ఉపాధ్యాయురాలు బాదాం అన్నపూర్ణ ప్రదర్శనను తిలకించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారు బహుమతులతో సన్మానించారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- పేదలకు భూమి పంచిన చరిత్ర కమ్యూనిస్టులది
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్

నిజామాబాద్ సిటీ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు ముమ్మాటికీ కమ్యూనిస్టులేనని, నాటి పోరాటంతో సంబంధం లేనివారు హిందూ–ముస్లిం పేరుతో చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని నాందేవ్ వాడలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై అబ్బాస్ మాట్లాడారు. స్వేచ్ఛ కోసం, ఎర్రజెండా అండతో ప్రజలు పోరాటాల బాట పట్టారని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి ఎందరో నాయకులు దొరలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దొరల ఆధీనంలోని భూముల్లోంచి 10 లక్షల ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. నాటి పోరాటంతో ఎలాంటి సంబంధం లేని వారు నేడు పోరాటంపై వక్రీకరణలు చేస్తున్నారన్నారు. రాబోయే తరాల కోసం, హక్కుల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాటాలు చేపడదామని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణ పేరుతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో సీపీఎం నాయకులు నూర్జహాన్, పల్లపు వెంకటేశ్, శంకర్ గౌడ్, సుజాత, యేశాల గంగాధర్, కొండ గంగాధర్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశం చేయాలి



మాట్లాడుతున్న సుధాకర్

నిజామాబాద్ నాగారం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని తెలంగాణ ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సాయుధ పోరాట విలీన దినోత్సవ సమావేశం సీపీఐ నగర్ కార్యదర్శి వై.ఓమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ 77వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా ఈనెల 16 వరకు గ్రామ, మండల కేంద్రాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి, సభలు నిర్వహించాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విలీన దినోత్సవ చరిత్రను ప్రజలకు వివరించాలన్నారు. సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని కోరారు. కమ్యూనిస్టుల కారణంగా తెలంగాణ ప్రాంతంలో 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందన్నారు. హైదరాబాద్‌సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న నిజాంనవాబ్ భారత్‌లో విలీనం చేశారన్నారు. బీజేపీ సాయుధ పోరాట చరిత్రను హిందు– ముస్లిం పోరాటంగా వక్రీకరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు బి.రఘురాం, రంజిత్, నగర నాయకులు సక్కి. సురేష్, అనిల్, దేవేందర్, సాయమ్మ గంగామణి, ఫిరోజ్, భాను, శుభోదు, కుశాల్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు

నిజామాబాద్ సిటీ : రాష్ట్రంలో రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి 22 వరకు వ్యవసాయ, తహసీల్దార్ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ల ముందు ఆందోళనలు నిర్వహించాలని ఏఐయూకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో యూరియా సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు.

### ఆధ్యాత్మిక క్షేత్రంగా వారాహి మాత దేవాలయం



నిజామాబాద్ రూరల్ : నగరంలో అమ్మవెంచర్‌లోని వారాహి మాత దేవాలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటుందని మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ పేర్కొన్నారు. కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠంలో వారాహి మాత ఆలయంలో ప్రతిష్ఠించబోయే అమ్మవారి పంచలోహ విగ్రహానికి మంచాల జ్ఞానేందర్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శారదా పీఠాధిపతి భారతి తీర్థ మహాస్వామి, జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి ఆశీస్సులతో పూజ కార్యక్రమాలు నిర్వహించామని జ్ఞానేందర్ తెలిపారు. కార్యక్రమంలో మరుమాముల వెంకటరమణ శర్మ, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, పురాణం మహేశ్వర శర్మ, ,వేగేటి పశుపతినాథ శర్మ, తుండ్ల కమలాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.